# వారధి

"వసూ! ఎల్లుండు సెకండ్ సాటర్ డే కదా. ఆ రెండ్రోజులూ అమ్మ ఎలాగో ఎడ్జస్టవుతుందిలే. నువ్వు మీ పుట్టింటికెళ్లిరా!"

ఆఫీసుకెళ్తూ చెప్పేడు మూర్తి.

వసుంధర మాట్లాడలేదు. అప్పటికే ఆమె గుండెల్లో రాయి పడింది. ముఖం పాలిపోయింది. గుండెలోతుల్లోంచి ఆవేదన తొలుచుకొస్తోంటే ఒంట్లో నిలబడే శక్తి కూడా లేనట్టు కూలబడిపోయింది.

"అమ్మాయ్ వసూ!" అత్తగారు తీయగా పిలిచింది.

కళ్లు తుడుచుకుంటూ అత్తగారి దగ్గరికెళ్లింది వసుంధర.

"పుట్టింటికెళ్తునావుట కదా! అబ్బాయి చెప్పాడు. రెండ్రోజుల్లో వచ్చేస్తావని కూడా చెప్పాడు. ఎలావోలా వండి వారుస్తాన్లే. పాపం పుట్టింటికెళ్లి మూడు నెలలవుతోందాయె. కన్నవారిని చూసి రావాలని నీకుమాత్రం ఉండదూ!"

పేలవంగా నవ్వింది వసుంధర.

"పిల్లల్ని తీసుకెళ్లకూడదూ. తాతగారి ఇల్లనీ, తాతగారేదో పెడతారనీ వాళ్లకీ ఆశ ఉంటుంది కదా. ఆయనా మనవలకి బట్టలు కుట్టించి ఆర్నెల్లవలేదూ?!"

"వాళ్లకి యూనిట్ టెస్టులున్నాయి. బట్టలు నానబెట్టాను..." అంటూ పెరట్లోకి నడిచింది.

బట్టలు ఉతికి ఆరవేసింది. స్నానం చేసింది. అత్తగారికి భోజనం వడ్డించింది. అన్నీ యాంత్రికంగానే. అన్నం తినాలనిపించలేదు. కాసిని పాలు తాగి పడుకుంది. నిద్రరాలేదు. నిద్రపోవాలనీ లేదు. ఏవేవో ఆలోచనలు. కళ్లు మూసుకుంది.

పిల్లలు కాన్వెంటు నుంచొచ్చారు. బోర్నవిటా కలిపి ఇచ్చింది.

"మమ్మీ! ఊరికి మేమూ వస్తాం" క్రాంతి అంది. శరత్ కూడా ఆశగా చూశాడు.

"ఇప్పుడొద్దమ్మా. స్కూలుందికదా! వేసవి సెలవుల్లో తీసుకెళ్తాన్లే"

"మమ్మీ మరేమో ఊర్నించి బోల్డు మిఠాయిలూ, చాక్లెట్లూ తెస్తావంటకదా! నాకు కొత్త షూస్ తే మమ్మీ"

"ఎవరు చెప్పేరేం"

"నానమ్మ చెప్పింది. షూస్ గురించి నానమ్మే అడగమంది. మమ్మీ! తాతయ్యా వాళ్లకి బోల్డు డబ్బుందా?"

ఆమె ముఖంలోని రక్తం ఇంకిపోగా ఆ స్థానాన్ని విషాదవీచికలు ఆక్రమించాయి. "లేదమ్మా. వాళ్లకన్నా మనమే ఉన్నవాళ్లం"

"మనమే వాళ్లకి పెట్టొచ్చు కదా మమ్మీ. పాపం వాళ్ల దగ్గర్నుంచి తెచ్చుకోవడం ఎందుకూ?"

"నువ్వు పెద్దయ్యాకగాని నీ ప్రశ్నలకి మాకు సమాధానం తెలీదమ్మా" కూతురి తల నిమురుతూ అంది.

మరి కాస్సేపటికొచ్చాడు మూర్తి. చాలా హుషారుగా ఉన్నాడు. దారిలో కొనుక్కొచ్చిన పూలపొట్లం అందిస్తూ "అలా తేఖ్యం మొహం వేసుకున్నావేం? ఏ ఆడపిల్ల అయినా పుట్టింటికెళ్లమంటే చాలు ఎగిరిగంతేస్తుంది. నువ్వెక్కడో మాలోకానివి!" విసుక్కున్నాడు.

"నువ్వు పువ్వుల్లో పెట్టి చూసుకుంటూంటే నీ కష్టం దానికేం తెలుస్తుందీ!" సాగదీసింది అత్తగారు.

టీ గ్లాసందిచ్చి మౌనంగా లోపలికెళ్లిపోయింది వసుంధర. ఆపి కూర్చోమన్నాడు. తుఫానునెదుర్కోడానికి సిద్ధపడుతూ సోఫాలో కూర్చుంది.

"ఇంత క్రితమే సిద్ధాంతిని కలిశాను. నీ జన్మ నక్షత్రాన్ని బట్టి పేరుబలాన్ని బట్టి తూర్పు సింహద్వారం మంచిదిట. లక్కీగా నిన్న మేం చూసిన హౌస్‌ప్లాట్ కూడా తూర్పు ముఖమే అనుకో. నూట ఇరవై చదరపు గజాలూ ఇరవైవేలు. ఇంకో రెండేళ్లలో చక్కని కాలనీగా డెవలప్ అవుతుంది. అప్పుడా స్థలం యాభైవేలకి కూడా దొరకదు. ఇప్పుడే సైట్ కొనెయ్యడం తెలివైనపని. తాపీగా ఇల్లుకట్టుకోవచ్చులే. ఏమంటావ్?"

ఆమె జవాబివ్వలేదు. అతడు జవాబుని ఆశించనూలేదు. తిరిగి తనే అన్నాడు "మన దగ్గర పదివేలదాకా ఉన్నాయి. ఇంకో పదివేలుంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. నువ్వు మీ నాన్నకి ఎలాగోలా నచ్చచెప్పి తీసుకురావాలి..."

ఆమె గుండెలు గుభిల్లుమన్నాయి.

పదివేలు!

ఆమె కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

"మావగార్ని అడగాలంటే నాకూ ఇబ్బందిగానే ఉంది. కాని తప్పదు. మన పిల్లల బంగారు భవిష్యత్తుకోసం ఇప్పట్నుంచీ పునాదిరాళ్లు వెయ్యకపోతే ఎలాచెప్పు! ఇంకో ముఖ్యమైన సంగతేమిటంటే ముద్దొచ్చినపుడే సంకెక్కాలన్నారు. పుట్టింటినుంచి ఏం నొల్లుకున్నా ఇప్పుడే నొల్లుకోవాలి. ఇంకో ఏడాదికో ఆర్నెల్లకో నీ చెల్లెల్లి పెళ్లి చేస్తారు. ఆ తర్వాత అరచి గీపెట్టినా పైసా విదల్చరు. ఉన్నదంతా తానే ఊడ్చికెళ్లిపోతూంది. వసంత నీలాగ గంగిగోవు కాదు-ఘటికురాలు!"

వసుంధర ఏమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడినా కంఠశోష తప్ప ఎవరూ ఏమీ వినిపించుకోరని బాగా తెలుసు.

ఆ రాత్రి నిద్రపోలేదామె.

క్రితంసారి పుట్టింటికెళ్లినపుడు జరిగిన ఘటన కళ్లముందు కొచ్చి నిలిచి నిద్రపోనివ్వలేదామెని. కదిపి కుదిపి కూర్చో బెట్టింది.

సుమారు రెండు నెలలక్రితం పుట్టింటికెళ్లింది. తనని గుమ్మంలో చూస్తూనే తల్లి ఉలిక్కిపడింది. ఆమె ముఖంలో కదలి మాయమైన భయం నీడల్ని స్పష్టంగా చూసింది వసుంధర.

"నువ్వా వసూ. రా! రామ్మా పిల్లలంతా బావున్నారా? వాళ్లని కూడా తీసుకురాక పోయావుటే."

"స్కూలు మాన్పిస్తే ఆయన ఊరుకోరమ్మా"

అక్క మాటలు వినిపించి వసంతా, వాసూ లోపల్నుంచొచ్చారు.

"మళ్లీ టెండర్ వెయ్యడానికేనా అక్కా" చిన్నగా నవ్వుతూ అడిగింది వసంత.

"టెండర్ వెయ్యడానికే కాదు. దాన్ని యాక్సెప్ట్ చేయించి, సొమ్ము పట్టుకుపోదామని వచ్చింది. అంతే కదా అక్కా?" వాసు అన్నాడు.

బిక్క చచ్చిపోయింది వసుంధర.

"ఇంట్లో అడుగుపెట్టిందో లేదో... అవేంమాటలర్రా..." తల్లి కసిరింది.

"ఇవాళ కొత్తా ఏమిటి? గత ఏడెనిమిదేళ్లనుంచీ మేం చూస్తోన్న భాగోతమే కదా!" వాసు అన్నాడు.

"నోర్మయ్యరా. అత్తింట్లో కాపురం చేసే ఆడదాని పరిస్థితి నీకెలా తెలుస్తుందిరా!"

వసుంధర పిల్లిలా లోపలికెళ్ళిపోయింది.

ఒకప్పుడు ఆడపిల్ల పుట్టింటికొస్తే అదో వేడుక అయ్యేదిట. అభిమానాలూ ఆత్మీయతలూ పాలలా పొంగేవిట. అలాటిదిప్పుడు...!

"ఎప్పుడొచ్చావు వసుంధరా!" పెరట్లోకాళ్ళు కడుక్కుంటోంటే పక్కింటి పిన్నిగారడిగింది.

"ఇంతక్రితమే పిన్నీ. బాబాయిగారి ఆరోగ్యం బాగుంటోందా?"

"ఏం బాగులెద్దూ. ఆయన కాలూ చెయ్యీ బాగున్నపుడు కొడుకులూ పీక్కు తిన్నారు. కూతుళ్ళూ పీక్కుతిన్నారు. పక్షవాతం వచ్చి మంచాన పడేసరికి ఒక్కరంటే ఒక్కరు తొంగి చూస్తే ఒట్టు!"

"కలికాల మహిమ!" సానుభూతిగా అంది.

"అంతేలేమ్మా. అలాగనుకునే సరిపెట్టుకుంటున్నాం. అవునుగాని వసుంధరా మళ్ళీ ఏం తెమ్మని తోలిందేమిటి నీ అత్త రాక్షసి...?"

"అదీ...మరి..."

"నువ్వేదో దాయాలనుకుంటావుగాని ఇలాటివి దాగుతాయా ఏవిటి నీ పిచ్చిగానీ. చూడమ్మాయ్ నేనన్నాననికాదుగాని, వసుంధరా – చీటికీ మాటికీ ఇలా రావటం ఏం బాగోలేదమ్మా. మీ నాన్న పరిస్థితి మాత్రం ఏమంత బాగుంది చెప్పు. మీ ఆయన మంచిగా ఉన్నపుడు పక్కకిచేరి నచ్చచెప్పుకోవాలి. లేకపోతే ఆ దాహం పెరిగి పెరిగి నీ ప్రాణాలమీదకి తెచ్చినా తెస్తుంది తల్లీ..."

అదిరిపడింది వసుంధర. గొంతు తడారిపోగా వెర్రినవ్వు నవ్వి లోపలికెళ్ళిపోయింది ఎవరో పిలిచినట్టు.

భోంచేస్తోంటే తండ్రి వచ్చాడు.

"ఏమ్మా వసూ! అంతా బాగానే ఉన్నారు కదా" దగ్గరికొచ్చి ఆదుర్దాగా అడిగారు.

"బాగానే ఉన్నారు నాన్నా. మీ ఆరోగ్యం ఎలా ఉంది? ఆయాసం తగ్గిందా?"

"నా సంగతికేంలేమ్మా గుండ్రాయిలా ఉన్నాను. నీ సంసారం బాగుంది. అంతే చాలు. నువ్వు భోంచెయ్యమ్మా." చిన్నగా నిట్టూరుస్తూ గదిలోకి వెళ్లారు.

వసుంధర ఆయన మొదటి సంతానం. ఆమె తర్వాత అయిదేళ్లకి గాని మళ్ళీ పిల్లలు పుట్టలేదు. అందువల్ల ఆమె అంటే ఆయనకెంతో అభిమానం. ఆమె పుట్టాకే ఉ

ద్యోగం ఖాయమైంది. అంచేతామెనెపుడూ 'నా భాగ్యలక్ష్మి మా ఇంటి మహాలక్ష్మి' అంటూండేవారు. పెళ్లయ్యేవరకూ ఆమెకూడా 'నాన్నకూచి' లానే ఉండేది.

రాత్రి భోజనాలయ్యాక అంతా హాల్లో కూర్చున్నారు.

"చల్లకొచ్చి ముంత దాచటం ఎందుకే అక్కా నీ డిమాండ్స్ ఏమిటో టకటకా చెప్పేసేయ్. నువ్వొస్తే చాలు ఇంట్లో ఎవరికీ నిద్ర రాదుగా. వచ్చిన కారణం కక్కేస్తే కనీసం నువ్వైనా హాయిగా నిద్రపోవచ్చు."

వాసు మాటలకి నొచ్చుకున్నాడు తండ్రి. "అవేం మాటల్రా. పాపం ఆడపిల్ల. అస్వతంత్రురాలు. అది మాత్రం ఏం చేస్తుంది చెప్పు. ఇలా రావటం దానికి మాత్రం బాధగా ఉండదూ?"

"ఏం ఉండదు డాడీ. ఏదోరకంగా మా ఇల్లు నిండితే చాలు అని చూసే ఆడవాళ్ల మనస్తత్వాలు మారనంతవరకూ ఇలాటి సమస్యలకి పరిష్కారాలుండవు" వసంత అంది.

"ఇప్పుడిలాగే అంటావు. పెళ్లై గడపదాటగానే మేం పరాయి వాళ్లమైపోతాం. నువ్వూ అక్క లాగే తయారవుతావు." వాసు ఎత్తిపొడిచాడు.

"ఏంకాదు. ఆకాశంలోనే కాదు అన్నిటా సగం అని భావించే ఈ తరపు ఆడపిల్లని నేను. ఏదైనా సరే స్వయంగా సాధించుకుంటాంగాని దేనికీ దేబిరించం. నిలువునా దోచుకోం. మరొకరి అధికారానికీ, జులుంకీ తలొగ్గం. తలదించుకునే పనులు చెయ్యం"

"హియర్! హియర్!" చప్పట్లు కొట్టాడు వాసు.

"నువ్వుండరా. ఏమైనా వసంత పద్ధతి వేర్రా. తనన్నది సాధించే లక్షణం వ్యక్తిత్వానికి విలువిచ్చే స్వభావం చిన్నప్పట్నుంచీ దానికున్నాయి. దాని గురించి నాకు దిగుల్లేదురా. వసుంధరే బొత్తిగా నోరులేనిది. చెప్పుతల్లీ ఏం తెమ్మన్నారు?"

"మీ అల్లుడికి మ్యూజిక్ ఇష్టంకదా నాన్నా. మ్యూజిక్ సిస్టం కొన్నారు. సింగపూర్నించి ఎవరో తెచ్చి అమ్ముతోంటే తీసుకున్నారు. అయిదువేలు కావాలి.." అంది వసుంధర మెల్లగా.

రెండు నిమిషాలపాటాయనేమీ మాట్లాడలేదు. తర్వాత ఒక నిశ్చయానికొచ్చి అన్నారు "ఎక్కడో అక్కడ చూస్తాన్లేమ్మా. నువ్వేం ఇదవ్వకు"

మర్నాడాయన ఇంట్లో లేరు. ఆఫీసుకి వెళ్లలేదు.

ఎక్కడెక్కడో తిరిగి ఎపుడో అర్ధరాత్రి వేళ వచ్చారు.

ఆ మర్నాడు బస్సెక్కిస్తూ అన్నారాయన.

"ఏ తండ్రి అయినా కూతురికి ఉన్నంతలో బాగానే పెట్టాలని చూస్తాడు తల్లీ. పరాయి ఇంట బిడ్డకు ఎలాంటి కష్టమూ రాకూడదని తపిస్తూనే ఉంటాడమ్మా. కాని దేనికైనా ఒక హద్దు ఉంటుంది కదమ్మా! నీకు తెలీందేవుంది చెప్పు. వసంత ఎదిగొచ్చింది. దానికేదో సంబంధం చూసి చెయ్యాలి. వాసుకింకా ఏం ఉద్యోగం రాలేదు. కాస్త మా గురించి కూడా ఆలోచిస్తూండు తల్లీ. కాస్త తెలివిగా అనువైన సమయం చూసి అల్లుడిగారికి నచ్చ చెప్తూండమ్మా..."

ఆయన స్వరం గాద్గదికమయ్యింది.

తనని భుజాలమీదెక్కించుకుని తన ఆనందంకోసం గంతులేసిన తండ్రి ఇవాళ మూర్తీభవించిన విషాదంలా కనిపించేసరికి కదలిపోయింది వసుంధర. కన్నీళ్లు ఆగలేదు. ఏడ్చేసింది.

"ఛ-ఊరుకోమ్మా. ఏదో ఉండబట్టలేక చెప్పేనుగాని రావద్దనటం లేదమ్మా. జాగ్రత్త తల్లీ..." ఇంకేం చెప్పేవాడోగాని బస్సు కదలటంతో సంభాషణ తెగిపోయింది.

* * *

అదంతా గుర్తొచ్చేసరికి ఆమె గుండెలు బరువెక్కాయి.

ఇక ఈ డబ్బు 'ఆట'లో తను పావుగా ఉండకూడదు.

అందుకేం చెయ్యాలో ఈ ప్రయాణం ఎలా తప్పించుకోవాలో అని ఆలోచిస్తూండి పోయింది రాత్రంతా వసుంధర.

తెల్లవారింది. అవాల్టి పత్రికలోని ఓ వార్త ఆమెనాకర్షించింది.

ఆమె పుట్టింటికెళ్లే ఊరిదారిలోని ఒక వంతెన కూలిపోయిందిట! రాకపోకలు ఆగిపోయాయిట!

పెళ్లిలో అప్పగింతల సమయంలో తండ్రి అన్నమాటలు గుర్తొచ్చాయామెకి.

"ఆడపిల్ల పుట్టింటికీ అత్తింటికీ మధ్య వారధిలాటిదమ్మా. పుట్టింటికి వన్నెతెచ్చేలా అత్తింటికి గౌరవం దక్కేలా ఉండాలి నీ ప్రవర్తన"

"ఏమండీ. పేపర్ చూశారా? మా ఊరెళ్లే దార్లోని వంతెన కూలిపోయిందిట. బస్సులు తిరగటం లేదుట. రేపటి నా ప్రయాణం కేన్సిల్."

"వంతెన పడితే ఏవయింది. రేపటికేదో ఏర్పాటు చేస్తార్లే. లేకపోతే చుట్టూ తిరిగెళ్లువుగాని"

ఆమె మోములో బాధావీచికలు కనిపించేసరికి అతడి నుదురు ముడిపడింది. "దేనిగురించి?"

"మా వాళ్ల సంగతేనండీ. క్రితంసారి వెళ్లినపుడు అంతా నానా మాటలూ అన్నారు. నన్నంటే ఫర్లేదు. మిమ్మల్నీ, అత్తయ్యగార్నీ కూడా అన్నారు. మీకు సంస్కారంలేదన్నారు. వట్టి స్వార్థపరుడన్నారు. ఇతరుల సొమ్ముకోసం అర్రులు చాచే వంశమన్నారు. ఇరుగుపొరుగుకి కూడా చెప్పి మన గురించి యాగీ చేశారు. మీ అత్త ఒకనాటి కోడలు కాదూ అన్నారు. ఈనాటి కోడలు రేపటికి అత్తకాదూ అన్నారు. వారి మాటలకి పౌరుషం వచ్చి ఇంకెప్పుడూ మీ గడప తొక్కనని చెప్పి వచ్చేశాను. మనింటి గౌరవ మర్యాదలకన్నా వారితో సంబంధం ఎక్కువ కాదనిపించింది. ఈ ఇంటి ఇల్లాలిగా అది నా బాధ్యత అనిపించింది అందుకని..."

"అర్థమైంది. అత్తవారుకదా అడిగిందల్లా పెట్టడం రివాజు కదాని అడుగుతున్నానుగాని మనమేం బికారులమని కాదు. మనకీ ఆత్మాభిమానం ఉంది. ఓకే. రేపు వెళ్లొద్దు. ఇంకెప్పుడూ దేహీయని యాచించొద్దు" అన్నాడు.

"అవున్రా అబ్బాయ్. వాళ్లు సంతోషంగా పెడితే తీసుకుంటాంగాని ఏడుస్తూ పెడితే మనకిమాత్రం ఏం ఒంటబడుతుందీ! బుద్ధొచ్చేలా బాగా సమాధానం చెప్పేవు"

వసుంధర కళ్లల్లోకి సంతోషపు మెరుపులూ, ఆనంద బాష్పాలూ వరదలా వచ్చాయి.

'నన్ను క్షమించు నాన్నా. పుట్టింటికీ, అత్తింటికీమధ్య డబ్బు వారధిగాక ప్రేమ వారధిగా ఉండాలనే ఈ ప్రయత్నం. అందుకోసం వేసిన తొలి అడుగులో మీమీద లేనిపోనివి కల్పించి చెప్పాను. అసలైన వారధి నిర్మించడానికి ఈ వారధిని కూల్చేశాను. నన్ను క్షమిస్తావు కదూ?'

మనస్సులో అనుకుందో లేదో, కిలకిలా నవ్వులూ వినిపించాయి. చూస్తే ఎదుట క్రాంతి.

"ఏ లోకంలో ఉన్నావు మమ్మీ"

"మీ కాలపు లోకంలో. మీరు అసలు సిసలు వారధులుగా ఉండటానికి నేను సైతం పునాదిరాయి వేస్తున్నానమ్మా" అంటూ కూతుర్నెత్తుకుని ముద్దు పెట్టుకుంది వసుంధర.

**(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)**

**28.9.1998**